క్లుప్తంగా

అచ్చంపేట తహసీల్దార్‌గా సరోజిని

అచ్చంపేట: అచ్చంపేట తహసీల్దార్‌గా ఎస్.సరోజిని మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈమె సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జి.శ్రీనివాసయాదవ్ గురజాలకు బదిలీపై వెళ్లారు.

స్వచ్ఛ సత్తెనపల్లికి సహకరించండి

సత్తెనపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛ సత్తెనపల్లిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీవో హోం సెంటర్‌లో మంగళవారం పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. శానిటేషన్ వర్కర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవన్నారు. ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి శానిటరీ కార్మికులకు అందించాలన్నారు. అనంతరం తాలూకా సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ను సందర్శించి అక్కడ ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి, సిబ్బందిఉన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి వార్షిక తిరునాళ్ల



దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి కల్యాణం, అనంతరం భక్తి గీతాలాపన నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శిరిగిరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా జేఈఈ మెయిన్స్‌లో హర్షిత్ ప్రతిభ



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన కురివెళ్ల సాంబశివరావు, శివపార్వతి దంపతుల కుమారుడు హర్షిత్ ఆల్ ఇండియా జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో 352వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల తన కార్యాలయంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం హర్షిత్‌ను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. భవిష్యత్తులో మరింతగా రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

శావల్యాపురం: రైతుసేవా కేంద్రాల్లో సన్నచిన్నకారు రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు తెలిపారు. మంగళవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల ద్వారా పంటలు సాగు చేయాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లో జీలుగులు 10 కేజీల సంచి రాయితీ మినహాయించి రూ.545 రూపాయలకు అందజేస్తున్నట్లు తెలిపారు. పిల్లిపెసర 8 కేజీల సంచి రూ, 720 రూపాయలు, జనుము విత్తనాలు 10 కేజీల సంచి రూ.615 రూపాయలకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఐదు ఎకరాల లోపు సాగు భూమి కల్గిన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాయితీపై ఇస్తున్న పచ్చిరొట్టి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకొని మంచి దిగుబడులు సాధించాలన్నారు.

మహిళపై దాడి

నరసరావుపేటటౌన్: పాత కక్షల నేపథ్యంలో మహిళపై ఇద్దరు దాడికి పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ హైమారావు మంగళవారం తెలిపారు. పెద్ద చెరువు 7వ లైన్లో నివాసం ఉంటున్న బత్తుల కొండమ్మకు బత్తుల శ్రీనివాసరావు, బత్తుల అంకమ్మరావుల మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో కొండమ్మపై శ్రీనివాసరావు, అంకమ్మరావులు దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యవసాయాధికారుల బదిలీ

నాదెండ్ల: చిలకలూరిపేట నియోజకవర్గంలోని మూడు మండలాల వ్యవసాయాధికారులు బదిలీ అయ్యారు. నాదెండ్ల మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న ఎ.హరిప్రసాద్ యడ్లపాడుకు, యడ్లపాడు వ్యవసాయాధికారి సీహెచ్ సరిత చిలకలూరిపేటకు, చిలకలూరిపేట వ్యవసాయాధికారి టి శ్రీలత నాదెండ్ల మండలానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉన్నతాధికారుల నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. బుధ, గురువారాల్లో రిలీవ్‌కానున్నారు.

ఆ అవసరానికి ఎటు వెళ్లాలి?

మేజర్ పంచాయతీలో సామాజిక మరుగుదొడ్లు నిల్

- ప్రయాణికులు, ప్రజలతో నిత్యం రద్దీగా ఉండే క్రోసూరు బస్టాండ్ ప్రాంతం
- మరుగుదొడ్లు లేక జనం ఇక్కట్లు
- దశాబ్ద కాలంగా కోరుతున్నా ఫలితం శూన్యం
- తీవ్ర అవస్థలు పడుతున్న మహిళలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు



క్రోసూరులోని అమరావతి బస్టాండ్ సెంటర్

క్రోసూరు: క్రోసూరు మేజరు పంచాయతీ మాత్రమే కాకుండా గుంటూరు, సత్తెనపల్లి, అచ్చంపేట, పిడుగురాళ్ల వైపు వెళ్లేందుకు నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే గ్రామం. దీనికి తోడు సుమారు 15 వేలు జనాభాగల మేజరు పంచాయతీ. కానీ ఇంత పెద్ద పంచాయతీలో సామాజిక మరుగుదొడ్లు లేక జనం అవస్థలు పడుతున్నారు.

మాటల్లోనే 'స్వచ్ఛభారత్'

పరిశుభ్రత, స్వచ్ఛభారత్ గురించి అవగాహన పేరుతో ర్యాలీలు నిర్వహించడం.. నాయకులు, అధికారులు ఊదరగొట్టేలా ప్రసంగాలు ఇవ్వడం మినహా నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో సామాజిక మరుగుదొడ్లు నిర్మించాలన్న కనీస విషయాన్ని విస్మరిస్తున్నారు. క్రోసూరుకు సత్తెనపల్లి, గుంటూరు, అచ్చంపేట, పిడుగురాళ్ల వైపుల నుంచి ప్రతి అర గంటకు బస్సులు వచ్చిపోతుంటాయి. నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికుల రాకపోకలు జరుగుతున్నాయి. కానీ ప్రయాణికుల సౌకర్యార్థం ఎక్కడా సామాజిక మరుగుదొడ్లు మాత్రం కనిపించవు.

స్థలాలున్నా.. పట్టించుకోరన్నా..!

క్రోసూరులో ఆర్టీసీ స్థలం, ఆర్అండ్‌బీ బంగ్లా స్థలం ఉన్నా స్థలాలు దొరకటం లేదంటూ ప్రజా ప్రతినిధులు సమస్యను దాట వేయటం జరుగుతుంది. క్రోసూరులో గ్రామ శివారులో ఆర్టీసీ స్థలం ఖాళీ స్థలం ఉంది. అందులో టాయిలెట్లు ఏర్పాటు చేసి, బస్సులు అక్కడే తిరిగి వెళ్లేవిధంగా ఏర్పాటు చేయవచ్చని ప్రజలంటున్నారు. అదేవిధంగా అమరావతి బస్టాండ్ సెంటర్‌లో ఆర్అండ్‌బీ భవనంతోపాటు విశాలమైన ఖాళీ స్థలం ఉంది. అక్కడైనా ఆర్అండ్‌బీశాఖ అనుమతి తో పబ్లిక్ టాయిటెట్లు నిర్మించవచ్చునని ప్రజలు కోరుతున్నా పాలకులు పట్టించుకోవటం లేదంటున్నారు.

మహిళలకు తీవ్ర ఇబ్బందులు



క్రోసూరుకు అనేక గ్రామాలు, పట్టణాల నుంచి నిత్యం బస్సులు వచ్చిపోతుంటాయి. బస్సుల కోసం వేచిచూసే ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరమైపుడు సామాజిక మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం, పంచాయతీ పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి .

– గుంటనాల బాజీ, స్థానికురాలు, క్రోసూరు

ఎన్నోసార్లు విన్నవించాం..



క్రోసూరులో సామాజిక మరుగుదొడ్ల కోసం ప్రజాసంఘాల ద్వారా అనేకసార్లు పోరాడాం. ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందచేశాం. కానీ ఇప్పటికీ ఫలితం దక్కలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సామాజిక టాయిలెట్లు నిర్మించాలి.

– వడ్లమూడి బాలకృష్ణ, న్యాయవాది, క్రోసూరు

జర్నలిజం గొంతు నొక్కాలనుకోవడం దారుణం

జడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి



అచ్చంపేట: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేయడం దారుణమని, జర్నలిజం గొంతు నొక్కేయాలనుకోవడం సమంజసం కాదని జడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అరెస్ట్ చేయడానికి ఏదో ఒక సాకు చూపాలి, సాక్షిలో ప్రసారాలకు విఘాతం కల్పించాలనే ధ్యేయంతో కూటమి నేతలు ప్రవర్తిస్తున్నారన్నారు. సాక్షిలో ప్రసారమయ్యే చర్చలే మీకు తప్పునిపిస్తున్నాయా, ఎల్లోమీడియాలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులపై, మాజీ మహిళా మంత్రులపై ఎన్ని దారుణమైన, అసభ్యకరమైన అసత్య ఆరోపణలు ప్రసారం చేస్తున్నారో కనబడటంలేదా అని ప్రశ్నించారు. తప్పు చేయకపోయినా తప్పు అని క్షమాపణ అడిగిన తరువాత కూడా అరెస్ట్ చేయడం ఎంతవరకు న్యాయం అని అన్నారు.

మహిళా స్వావలంబనకు వైఎస్ జగన్ పెద్దపీట

మహిళలకు సముచిత స్థానం కల్పించింది, దిశ యాప్‌ను తీసుకు వచ్చి మహిళలకు రక్షణ కల్పించింది జగన్ ప్రభుత్వంలో కాదా అని ప్రశ్నించారు. మహిళల పేరుతో ఇళ్ల స్థలాలు, ఇళ్లు, మహిళల పేరుపై రేషన్ కార్డులు, మహిళలు ఆర్థిక ఎదుగుదలకు వడ్డీలేని రుణాలు, 45 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు మహిళలకు ఆర్థిక చేయూతలాంటి ఎన్నో గొప్ప పథకాలు నిరాటంకంగా అమలైంది జగన్ ప్రభుత్వంలోనేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మహిళలకోసం ఇన్ని చేసిన వైఎస్ జగన్‌ను, సాక్షి ఛానల్‌ని, అందులో పనిచేసే సీనియర్ జర్నలిస్టులను కుంటిసాకులు చూపి అవమానించడం, అరెస్టులకు పాల్పడటం దారుణమన్నారు. ఇచ్చిన హామీలపై ప్రజలు ఎక్కడ తిరగబడతారోనన్న భయంతో ఇలాంటి జిమ్మిక్కులు చేయడం తగదన్నారు. నిజంగా సీఎం చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునే ప్రయత్నం చేయాలే తప్ప ఇలాంటి కుయుక్తులతో ప్రజలను మభ్యపెట్టాలనుకోవడం మానుకోవాలన్నారు. ఇప్పటికైన ఏ తప్పు చేయని కొమ్మిని శ్రీనివాసరావును విడుదల చేయాలన్నారు.

రీసర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): రీ సర్వే ప్రక్రియ మొదటి దశను త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు పేర్కొన్నారు. మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను మంగళవారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఇప్పటివరకు జరిగిన సర్వే వివరాలు పరిశీలించారు. అక్కడే ఉన్న రైతులతోను మాట్లాడి సర్వే పై అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. రైతులు కూడా భూములకు సంబంధించిన ఆధారాలను సర్వే సిబ్బందికి అందించి సహకరించాలని కోరారు. ఇప్పటివరకు గోళ్ళపాడు రెవెన్యూ గ్రామపరిధిలో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ చివరి దశకు చేరిందని, అనంతరం అభ్యంతరాలపై రైతులకు నోటీసులు అందించటం జరుగుతుందన్నారు. గ్రామ సర్వేయర్ నాగూర్‌మీరా, సర్వే సిబ్బంది తదితరులు ఉన్నారు.



గోళ్లపాడులో రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ముప్పాళ్ళ: ప్రకృతి లేనిదే మనిషి జీవితం లేదని, భావితరాల భవిష్యత్తు కోసం పర్యావరణ సంరక్షణ మనందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మీ చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని అంగన్‌వాడీ కేంద్రంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృభూమి పరిరక్షణకై ఒక మొక్క నాటుదాం అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణాన్ని వినాశనం చేస్తున్న ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండి పర్యావరణాన్ని ప్రేమిస్తూ మన వంతు కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ మాతృభూమి పరిరక్షణ కోసం ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లోను మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. సచివాలయ మహిళా సంరక్షకురాలు ఎం.కోటేశ్వరమ్మ, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు

మోహన్‌బాబు, విష్ణులు బుద్ధి మార్చుకోవాలి

బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దింటి ఫణి కృష్ణ

సత్తెనపల్లి: సినీ నటులు మంచు మోహన్ బాబు, మంచు విష్ణులు పరిశ్రమలో ఫ్లాప్ రాజాలుగా వెలుగొందుతున్నారని, ఇకనైనా బుద్ధి మార్చుకోవాలని బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దింటి ఫణి కృష్ణ అన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడారు. మోహన్‌బాబు, విష్ణులు ఫేమ్ లోకి రావడం కోసం శ్రీకాళహస్తి చరిత్రను వక్రీకరిస్తూ కన్నప్ప అనే చిత్రాన్ని తీస్తున్నారని, 'పిలక-గిలక' పాత్రలతో బ్రాహ్మణులను అవమానపరిచేలా చిత్రం పోస్టర్లు వేయడం జరిగిందన్నారు. దీనిని ఖండిస్తున్నామన్నారు. దీనిపై రాష్ట్ర బ్రాహ్మణ చైతన్య వేదిక, అర్చక సేవాసంఘం, సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో ఇప్పటికే రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ వేశామన్నారు. బ్రాహ్మణులపై వెకిలి సన్నివేశాలు పెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి అంపిరాయని రాజశేఖర్ శర్మ, కోశాధికారి కొడవడిగంటి నాగ పార్వతి శర్మ, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

స్వచ్ఛమైన మంచి నీళ్లు ఉచితంగా ఇవ్వాలి

- ఏపీసీఆర్‌పీఓ ప్రతినిధుల డిమాండ్
- జాయింట్ కలెక్టర్‌కు వినతి

నరసరావుపేట: జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఉచితంగా శుభ్రమైన తాగునీరు అందించాల్సి ఉండగా, ఈ నిబంధనను పాటించకుండా వినియోగదారులను బలవంతంగా నీటి బాటిళ్లు కొనుగోలు చేయించి లాభాలు ఆర్జిస్తున్నారని ఏంజెల్ ఫ్రైడ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ (ఏపీసీఆర్‌పీఓ) ప్రతినిధులు తెలిపారు. స్వీట్స్ షాపులు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత, శుభ్రత, చట్టవిధుల పాటింపు లోపాలపై ఏపీసీఆర్‌పీఓ రాష్ట్ర అధ్యక్షులు పిల్లి యజ్ఞనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి కె.కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్వీట్స్, చిరుతిండి పాకెట్లపై తయారీ తేదీ, గడువు ముగింపు తేదీలు పొందుపరచకుండా, గడువు ముగిసిన తేదీలను తొలగించి విక్రయిస్తున్నారన్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో రంగులు, రసాయనాలు, టేస్టింగ్ సాల్ట్‌లను ఉపయోగించడంతో పాటు, నిల్వచేసిన మాంసాన్ని వినియోగిస్తున్నారన్నారు. అనుమతి లేకుండా వాటర్ ప్లాంట్లను నడుపుతున్నారని, వాణిజ్య కార్యకలాపాలకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు బదులుగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తుండటం వల్ల గ్యాస్ సరఫరాపై ప్రభావం పడుతోందని ఫిర్యాదులో వివరించారు. వినతిపత్రం స్వీకరించిన జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, హోటళ్లు, రెస్టారెంట్లలో స్వచ్ఛమైన తాగునీరు ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుంటామని, అనుమతి లేని మినరల్ వాటర్ ప్లాంట్లను గుర్తించి వాటిపై కూడా తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సంస్థ ప్రతినిధులు జేసీని కోరారు.



జేసీ సూరజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

రిజిస్ట్రేషన్ల పురోగతి వేగవంతం కావాలి

శావల్యాపురం: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఈనెల 21న జరగనున్న నేపథ్యంలో గ్రామ సచివాలయాల వారీగా ఆన్‌లైన్ నమోదు పురోగతి లక్ష్యాలను అధిగమించాలని మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు నమోదు, గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వ సర్వేల పురోగతిపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామ సచివాలయాలు ఉండగా యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు 15 267 చేయాల్సి ఉండగా పెండింగ్‌లో లేకుండా త్వరితగతిన నూరుశాతం పూర్తి చేయాలన్నారు.112 యోగాసాలు వేసే ప్రదేశాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వ పరంగా చేయాల్సిన సర్వేలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఈవోపీఆర్‌డి పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ముగిసిన 'కిశోరి వికాసం'

క్రోసూరు: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మే నెల రెండవ తేదీ నుంచి నిర్వహిస్తున్న కిశోరివికాసం కార్యక్రమాలు మంగళవారంతో ముగిసినట్లు ఐసీడీఎస్ క్రోసూరు సెక్టార్ సూపర్‌వైజర్ వి.మాధవి తెలిపారు. క్రోసూరులో జరిగిన కిశోరివికాసం కార్యక్రమంలో పాల్గొన్న మాధవి మాట్లాడుతూ కిశోరివికాసం ద్వారా బాలికలకు విద్య, పోషకాహారం, వైద్యం, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాల నిరోధం, అక్రమ రవాణా అరికట్టడం తదితర విషయాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం కిశోరి బాలికలకు, కొందరు బాలురకు ఆటలపోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో క్రోసూరులోని అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

కందిపాడులో...

బెల్లంకొండ: బాల్య వివాహాలు అనేక అనర్థాలకు దారితీస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ తెలిపారు. మంగళవారం మండలంలోని కందిపాడు గ్రామంలో 'కిశోరి వికాసం'కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లకు 18 ఏళ్ల లోపు, మగ పిల్లలకు 21 ఏళ్ల లోపు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్య వివాహాలను నిరోధించడానికి విద్య ప్రాముఖ్యతను అందరూ తెలుసుకోవాలన్నారు. బాలికలు తమ హక్కులను తెలుసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమల్లేశ్వరి, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు హనుమాయమ్మ, నీలిమ, తల్లులు తదితరులు పాల్గొన్నారు.



క్రోసూరులో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలు

ముప్పాళ్ళలో...

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్ల లోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మి పాల్గొని ఋతుక్రమ పరిశుభ్రత, బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు, నివారణ, బాలల హక్కుల రక్షణ, కౌమారదశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆడపిల్లల పట్ల లింగ వివక్షత, అసమానతలు గురించి కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఏ.పీటర్‌డేమియన్, ఏఎన్ఎమ్ జ్యోతి, సచివాలయ మహిళా సంరక్షకురాలు కోటమ్మ, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కే.బుల్లిబాబు, అంగన్‌వాడీకార్యకర్తలు కె.రాజ్యలక్ష్మీ, ఎం.కమలాదేవి, ఎం.జయలక్ష్మి, పి.జమీలాబేగం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



వేల్పూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బాలాత్రిపుర సుందరి

వేల్పూరులో...

అచ్చంపేట: బాల్య వివాహాలవల్ల పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని, యుక్తవయస్సు రానిదే వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బాలాత్రిపుర సుందరి అన్నారు. మండలంలోని వేల్పూరులో కిశోరవికాశం కార్యక్రమంలో భాగంగా మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగె నష్టాలను వివరించారు. కిశోర బాలికలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ఇవ్వాలన్నారు. పిల్లలలో వచ్చే మార్పులకు అనుగుణంగా తల్లిదండ్రులు వారికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.అంజమ్మ, శివకుమారి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతంపై ఇంటింటి ప్రచారం



నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక నరసరావుపేట కమిటీ సభ్యులు భగవద్గీత-101 అనుబంధ గ్రంథాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఘడియం పెద్దిరెడ్డి మాట్లాడుతూ ద్వాపర యుగంలో కృష్ణుడు అర్జునుడికి జ్ఞానాన్ని ప్రబోధించాడన్నారు. ప్రపంచంలో ఉన్న ప్రతి మానవుడికి భగవద్గీత జ్ఞానంతో ఆత్మవికాసం కలుగుతుందన్నారు. సమాజంలో అధర్మం పెరిగిపోయి అశాంతి నెలకొనకుండా ప్రతి ఒక్కరూ జ్ఞానవంతులుగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, కోవూరి చినవెంకటేశ్వర్లు, కొరివి ఏడుకొండలు, అమరలింగయ్య, ఆంజనేయులు, పగడాల అశోక్, రాజశేఖరరెడ్డి, రాజేష్ ఉన్నారు.

పీఎండీఎస్ విత్తనాల వినియోగానికి ప్రోత్సాహం

- ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం కె.అమల కుమారి
- ఉన్నవ గ్రామ సందర్శన
- ప్రకృతి రైతులకు ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్‌పై అవగాహన

యడ్లపాడు: మండలంలోని ఉన్నవ గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.మల కుమారి ఏపీఎం (నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్) షాప్‌ను సందర్శించారు. గ్రామానికి చెందిన కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ షాప్ ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన ఘన జీవామృతం, కషాయాలు, పీఎండీఎస్ విత్తనాలు లభ్యమవుతున్నాయని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమలకుమారి మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాకాలాన్ని ఉపయోగించుకొని రైతులు తమ పొలాల్లో ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ విత్తనాలను వేసుకోవాలని సూచించారు. ఇది ఖరీఫ్ పంటలకు ముందు భూమిని సన్నద్ధం చేసేందుకు ఎంతగానో సహకరిస్తుందని చెప్పారు. ఈ కిట్లో 30 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వాటిలో పప్పుధాన్యాలు.. మినుము, పెసర, బొబ్బర్లు, నూనె జాతులు.. నువ్వులు, ఆముదం, వేరుశనగ, సుగంధ ద్రవ్యాలు..ధనియాలు, మెంతులు, ఆవాలు, ధాన్యాలు.. రాగులు, మొక్కజొన్న, కొర్రలు, కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతులు మొదలైనవి ఉంటాయని తెలిపారు. ఈ విధానం సాగు వల్ల భూమి ఏడాది పొడవునా కప్పబడి ఉండటంతో, నేలలో సూక్ష్మజీవజాల అభివృద్ధికి అనుకూలంగా మారుతుందన్నారు. దీంతో ప్రధాన పంటలకు అవసరమైన పోషకాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఇలా నవధాన్యాల ఉత్పత్తికి తోడ్పడడమే కాకుండా, పశువులకు పోషక మేతగా కూడా ఉపయోగపడుతుందని రైతులకు అవగాహన కల్పించారు. అలాగే పీఎండీఎస్ విత్తనాల వినియోగం వల్ల వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరగడం, అదనపు పంటల ద్వారా రైతులకు ఆదాయం లభిస్తుందన్నారు. నేల సారాన్ని మెరుగుపరచి జీవవైవిధ్యాన్ని కాపాడుతుందని తెలిపారు. రసాయన వాడకాన్ని తగ్గుతుందని, కలుపు, తెగుళ్ల సమస్యలు తగ్గి.. పంట వాతావరణ మార్పులకు తట్టుకునే స్థాయికి చేరతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జ్ కోటేశ్వరమ్మ, మాస్టర్ ట్రైనర్ బేబీరాణి, పాములు తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న అమలకుమారి

మలేరియా జ్వరంతో అప్రమత్తంగా ఉండాలి

శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం సీజను ప్రారంభం కానున్న నేపథ్యంలో దోమల నుంచి మలేరియా లాంటి వ్యాధులు సంభవించే అవకాశాలున్నాయని, ఈవ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల వ్యాప్తి చెందకుండా ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకునేలా వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. దోమల నుంచి సంరక్షణ చేసుకునేందుకు గాను దోమతెరలు వినియోగించాలన్నారు. అలాగే మురుగు కాల్వలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకోవాలన్నారు. మలేరియా లక్షణాలు కల్గియున్న వారిని గుర్తిస్తే సత్వరమే వైద్య సేవలు అందేలా వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, ల్యాబ్ టెక్నీషియన్లు సతీష్, సీతారామిరెడ్డి తదితరులు ఉన్నారు.